ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పేజీలు : 4 | సంపుటి : 01 | - సంచిక 208 | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | బుధవారం 06- 11 - 2024 | వెల - 2
Digital Edition



## అనంతపురంలో
## ఘనంగా ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్

అనంతపురం. నవంబర్ 05 రిపబ్లిక్ న్యూస్

వివరాలు 2లో

-ముఖ్య అతిథులుగా గౌరవ రాష్ట్ర హోంశాఖామాత్యులు, గౌరవ రాష్ట్ర డిజిపిలు

## పోలీసులు మెత్తబడ్డారు..
## ఇది జగన్ సర్కార్ కాదు



పల్నాడు రిపబ్లిక్ న్యూస్

వివరాలు 2లో

పల్నాడు జిల్లా మాచవరం మండలంలో సరస్వతి పవర్ సంస్థకు భూములు

నిబంధనల ఉల్లంఘన జరిగిందా, లేదా అనేది నిర్ధారించనున్న పవన్

రైతులతో మాట్లాడనున్న డిప్యూటీ సీఎం

ఏపీ మాజీ సీఎం జగన్ కు సంబంధించిన సరస్వతి పవర్ పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన కామెంట్స్ చేశారు. ఈ రోజు పల్నాడు జిల్లాలోని మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెంలో సరస్వతి పవర్ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యాజమాన్యం 1384 ఎకరాల భూముని కొన్నట్లు చెప్పారు. అందులో 24 ఎకరాల అసైన్డ్ భూమి ఉందన్నారు. బాంబులేసి భయపెట్టి రైతుల నుంచి భూములు తీసుకున్నారని ఆరోపించారు. ఇలాగే వదిలేస్తే పేట్రేగి పోతారన్నారు.

## మండలానికో ఇంటర్ కళాశాల ఏర్పాటు: మంత్రి నారా లోకేశ్

ఇంటర్ విద్యపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష

ప్రైవేటు కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండాలన్న మంత్రి

ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచన

పారదర్శకంగా, పకడ్బందీగా మెగా డీఎస్సీకి ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు 2లో








అమరావతి రిపబ్లిక్ న్యూస్

## చంద్రబాబు ప్లాన్ అదుర్స్
## ఏపీకి నెదర్లాండ్ సిస్టమ్..

రాష్ట్రంలో వరద సమస్యను ఎదుర్కోవడానికి చంద్రబాబు సర్కార్ నెదర్లాండ్స్ గ్రావిటీ కెనాల్ సిస్టమ్ ను తీసుకురానుంది. ఇందుకోసం అమరావతిలోని పలు ప్రాంతాల్లో 217 కి.మీ మేర రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు. వరదల సమయంలో నీటిని బయటకు పంపడానికి ఇది వీలు కల్పిస్తుంది.

వివరాలు 2లో

## రేషన్ కార్డుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

వచ్చే ఏడాది జనవరి నుంచి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని వెల్లడి

సన్నధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని వ్యాఖ్య

ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని పిలుపు


తెలంగాణ రిపబ్లిక్ న్యూస్



2లో

## జగన్‌కు చంద్రబాబు మరో బిగ్ షాక్..
## టీడీపీలో చేరిన కుప్పం





చిత్తూరు రిపబ్లిక్ న్యూస్

చిత్తూరు జిల్లా కుప్పంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. అమరావతిలో చంద్రబాబును కలిసి టీడీపీలో చేరారు. సుధీర్ కు పసుపు కండువా కప్పి చంద్రబాబు టీడీపీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ పదవులకు సుధీర్ రాజీనామా చేశారు. గత జగన్ సర్కార్ చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంపై

-మిగతా 2లో

## అమెరికా అధ్యక్ష ఎన్నికలపై ట్రంప్, జో బైడెన్ ప్రత్యేక పోస్టులు

ఈరోజే అమెరికా అధ్యక్ష ఎన్నికలు

ఇప్పటికే ముందస్తు ఓటింగ్‌లో పాల్గొన్న 7.5కోట్ల మంది అమెరికన్లు

ఓటర్లను ఉద్దేశిస్తూ ట్రంప్, బైడెన్ సోషల్ మీడియా వేదికగా పోస్టులు

ఓటర్లందరూ తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపు

వివరాలు 2లో




## పార్లమెంట్ శీతాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారు



## జగన్‌కు చంద్రబాబు మరో బిగ్ షాక్..

# టీడీపీలో చేరిన కుప్పం

స్పెషల్ ఫోకస్ పెట్టింది. 2021 నవంబర్ లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి కుప్పంను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేశారు.

**కుప్పం మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్న వైసీపీ**

దీంతో మొత్తం 25 కౌన్సిలర్ స్థానాలకు గానూ వైసీపీ 19 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. ఆ ఉత్సాహం టార్గెట్ కుప్పం అసెంబ్లీగా వైసీపీ పని చేసింది. వై నాట్ కుప్పం అని ఆ పార్టీ అధినేత జగన్ సైతం అనేక సార్లు మీటింగ్ లలో ప్రకటించారు. కుప్పం ఇన్చార్జి భరత్ కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది.

చంద్రబాబు కంచుకోట అయిన కుప్పంలో విజయం సాధించి సత్తా చాటాలని ప్రయత్నించింది. అయితే.. గత ఎన్నికల్లో సీన్ రివర్స్ అయ్యింది. కుప్పంలో చంద్రబాబు ఎనిమిదో సారి విజయం సాధించారు. చంద్రబాబు చేతిలో పరాజయం పాలైన భరత్ నియోజకవర్గంలో పెద్దగా కనిపించడం లేదు. ఇటీవల ఆయన కనిపించడం లేదంటూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా నమోదైంది.

అయితే.. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ కుప్పంతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ బలోపేతంపై ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ టీడీపీ గూటికి వచ్చేలా వ్యూహాలు రచించింది. అనంతరం ఇప్పుడు కుప్పం మున్సిపల్ ఛైర్మన్ కూడా టీడీపీ కండువా కప్పుకున్నారు. రానున్న రోజుల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు ఉండే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది

# అమెరికా అధ్యక్ష ఎన్నికలపై ట్రంప్, జో బైడెన్ ప్రత్యేక పోస్టులు

అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఈరోజు జరుగుతున్నాయి. సుమారు 24.5 కోట్ల మంది అమెరికన్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ముందస్తు ఓటింగ్ ద్వారా 7.5 కోట్లకు పైగా ఓటర్లు ఓటు వేశారు. ఈ క్రమంలో ఓటర్లను ఉద్దేశిస్తూ రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అధ్యక్షుడు జో బైడెన్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక పోస్టులు పెట్టారు. ఓటర్లందరూ తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**ట్రంప్‌ను కమల ఓడించడం ఖాయం: జో బైడెన్**

"మరికొన్ని గంటల్లో ఎన్నికలు. ఈ ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌ను కమలా హ్యారిస్ ఓడించడం ఖాయం. అందుకు మీరందరూ ఓటింగ్‌లో పాల్గొనాలి. ముందస్తు ఓటింగ్‌ను వినియోగించుకోని వారంతా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోండి" అని బైడెన్ పిలుపునిచ్చారు.

**అమెరికాను మళ్లీ గొప్పగా తీర్చుదిద్దుకుందాం: డొనాల్డ్ ట్రంప్**

"మన దేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన రాజకీయ ఘట్టానికి చేరువలో ఉన్నాం. అమెరికాను మళ్లీ గొప్పగా తీర్చిదిద్దుకుందాం. దీనికోసం మీరందరూ వచ్చి ఓటు వేయండి. కమలా హ్యారిస్ అధికారంలోకి వస్తే పశ్చిమాసియా ఆక్రమణకు గురవుతుంది. ఆమె మూడో ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభిస్తారని ఓటర్లకు తెలుసు. అందుకే ట్రంప్‌నకు ఓటు వేసి, శాంతిని పునరుద్ధరించండి. దేశ రాజకీయ చరిత్రలో అతిపెద్ద, విస్తృతమైన సంకీర్ణాన్ని నిర్మిద్దాం" అని ట్రంప్ అన్నారు.

# రేషన్ కార్డుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

రేషన్ కార్డుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వచ్చే ఏడాది జనవరి నుంచి తెలంగాణవ్యాప్తంగా రేషన్ కార్డు ఉన్న వారందరికీ సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇది దేశ చరిత్రలో ఓ మైలురాయి అన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

దాన్యం సేకరణ కేంద్రాల్లో ఎలాంటి గందరగోళం ఉత్పన్నం కాకుండా... రైతులకు మద్దతివ్వడానికి ప్రజాప్రతినిధులు క్షేత్ర పర్యటనలు నిర్వహించాలన్నారు. సన్న ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వడం చారిత్రాత్మకమన్నారు. ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఈరోజు సాయంత్రం ఆయన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

# మండలానికో ఇంటర్ కళాశాల ఏర్పాటు: మంత్రి నారా లోకేశ్

ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మండలానికో ఇంటర్ కళాశాల ఏర్పాటునకు ప్రణాళికలు రూపొందించాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ నారా లోకేశ్ నేడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఉండవల్లిలోని నివాసంలో ఇంటర్ విద్యపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... ప్రైవేటు కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివి ఐఐటీ, మెడిసిన్ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఫోటోలను దినపత్రికల్లో ప్రచురించేలా కసరత్తు చేయాలన్నారు.

రిమోట్ ప్రాంతాల్లో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేసే వారికి త్వరితగతిన అనుమతులు అందించాలని ఆదేశించారు. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించడం వల్ల 15 వేల వరకు అడ్మిషన్లు పెరిగాయనే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించారు. వచ్చే ఏడాది 2 లక్షల వరకు అడ్మిషన్లు పెరిగేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

జూనియర్ కాలేజీల్లో పనివేళలు పెంచడంతో పాటు విద్యార్థుల హాజరుపై సమీక్ష, ప్రోగ్రెస్ కార్డులను అందిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఉత్తమ అధ్యాపకులతో విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్సులకు శిక్షణ ఇప్పించాలని ఈ సందర్భంగా నారా లోకేశ్ సూచించారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎన్ సీఈఆర్టీ బుక్స్ ప్రవేశపెట్టడంతో పాటు ప్రశ్నాపత్రంలోనూ మార్పులు చేయనున్నట్లు తెలిపారు.

**పారదర్శకంగా, పకడ్బందీగా మెగా డిఎస్సీకి ఏర్పాట్లు చేయండి**

రాష్ట్రంలో టెట్ -2024 విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో మెగా డీఎస్సీ పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. స్కూల్ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ పై మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీ నిర్వహణ విధివిధానాలపై సమావేశంలో చర్చించారు. సాధ్యమైనంత ఎక్కువమంది అభ్యర్థులకు అవకాశం కల్పించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు.

రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు ఈనెల 11వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు పూర్తిచేయాలని అన్నారు.




# అనంతపురంలో ఘనంగా ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్



అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 12 మంది ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖామాత్యులు వంగలపూడి అనిత , రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రొబేషనరీ డీఎస్పీలకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర హోంశాఖామాత్యుల మాట్లాడుతూ ప్రొబేషనరీ డిఎస్పీల పాసింగ్ అవుట్ పెరేడ్ కు ముఖ్య అతిథిగా హాజరైనందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ అవకాశాన్ని కల్పించి ఇందులో భాగస్వామ్యం చేసిన గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు. ఇన్ని రోజులు కష్టపడి మీ కలలు, మీ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి విధుల్లో చేరబోతున్న నూతన డిఎస్పీలందరికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. దేశ రక్షణ... రాష్ట్ర ప్రజల ధన, మాన, ప్రాణాలు కాపాడటానికి ఈ వృత్తిని ఎంచుకోవడం హర్షణీయం. పోలీసు ఉద్యోగం మిగతా ఉద్యోగాల వంటిది కాదు. ఇందులో మీరు 24/7 విధులలో ఉంటారు. నిజాయితీ, నిష్పక్షపాతం, బాధితులపట్ల సానుభూతి, విధిపట్ల నిబద్ధతలను కలిగి ఉండాలి. సమాజాన్ని సుస్థిరంగా ఉంచి శాంతిభద్రతలు కాపాడే కీలక బాధ్యతలు కలిగి ఉంటారు. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా, నేరం జరిగినా వెంటనే స్పందించి పరిష్కారం చూపే పోలీసు వ్యవస్థను అందరూ గౌరవించాలి. ప్రజల సేవ చేయడం కోసం మిమ్మల్ని పోలీసుశాఖకు పంపిన తల్లిదండ్రులను అభినందిస్తున్నాను. పోలీసుశాఖకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. పోలీసుల గౌరవం పెంచేదిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి సంకల్పించారు. గత ఐదేళ్లలో పోలీసుశాఖ నిర్వీర్యమయ్యింది. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ టూల్స్ కు కూడా డబ్బు ఇవ్వలేదు. కనీసం అప్పాను నిర్మించలేని దుస్థితి. గ్రేహౌండ్స్ కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సంపూర్తిగా నిధులు ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వం రూ 9 కోట్లుకు యు.సి.సి ఇవ్వకపోవడం వల్ల 200 కోట్లు ఆగిపోయి పెండింగులో పడ్డాయి. ప్రస్తుతం పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేయాలి. రాష్ట్రంలో ఎక్కడైనా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరిగితే సీఎం ఆయా జిల్లాల ఎస్పీలతో మాట్లాడి అప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నారంటే ఈ ప్రభుత్వానికి మహిళల, చిన్నారుల రక్షణపై ఉన్న చిత్తశుద్ధి అవగతమవుతోంది. 2014-19 మధ్య కాలంలో మా ప్రభుత్వం సుమారు రూ. 600 కోట్లు పోలీసు సంక్షేమం, సౌకర్యాల కల్పనకు కేటాయించడం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఉన్నాయి. పోలీసు స్టేషన్ల నిర్మాణం, ఆధునీకరణలు చేయాల్సి ఉంది. అంతేకాకుండా పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేయాలి. ఆయుధాలు ఇవ్వడమో వాహనాలు ఇవ్వడమో కాదు పటిష్టమంటే పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వడమే. ప్రతీ జిల్లాలోను సైబర్ స్టేషన్ ఏర్పాటు చేశాం. గంజాయి మత్తులో, రాజకీయ ముసుగులో ఎంతో మంది నేరాలకు ఒడిగడుతున్నారు. టెక్నాలజీని ఉపయోగించి నేరాల కట్టడి కోసం ఈ ప్రభుత్వం కృషి చేస్తోంది. పోలీసు ప్రతిష్ట పెంపొందేలా పని చేయాలి. గౌరవం పెరగాలి. ఇటీవల విజయవాడలో వచ్చిన వరదల్లో కానిస్టేబుల్ నుండీ డీజీపి వరకు రంగంలోకి దిగి బాధిత ప్రజలకు సేవలు అందించడం అమోఘం. నిష్పక్షపాతంగా, నిజాయితీగా పనిచేద్దాం. మహిళలు, చిన్నారుల రక్షణ విషయంలో రాజీపడకండి. బాధ్యతగా వ్యవహరించి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమల రావు మాట్లాడుతూ ప్రొబేషనరీ డీఎస్పీలకు ఈరోజు మరుపు రానిది. పాసింగ్ అవుట్ పరేడ్ అనేది ముఖ్యమైన ఘట్టం. శిక్షణ పూర్తీ చేసుకుని సమాజంలోకి అడుగిడుతున్నారు. కానిస్టేబుల్ నుండీ సి.ఐ ల వరకు మీరు విధులు నిర్వర్తించాల్సి ఉంది. దశల వారీగా నిర్వర్తించే ప్రొబేషనరీ విధుల సందర్భంగా కింది స్థాయి సిబ్బంది నుండీ అధికారుల వరకు ఉన్న సాధక బాధకాలు అవగతమవుతాయి. అంతేకాకుండా చట్టాల పట్ల ఠసమగ్ర అవగాహన కల్గుతుంది. ఈరోజు ప్రతిజ్ఞ చేసిన విషయాలలో నిష్పక్షపాతంగా, నిర్భయంగా మరియు రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తామని ప్రమాణం చేశారు. ఈరోజు నుండీ పదవీ విరమణ పొందే వరకు ఈ ప్రతిజ్ఞలోని అంశాలను మరువకూడదు. మానవ హక్కులను కాపాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలకు అనుగుణంగా పని చేయడాన్ని ఎప్పుడు మరువకూడదు. దుష్ట శిక్షణ... శిష్ట రక్షణ రెండూ కీలకమే. రెండూ పక్కాగా చేయాలి. అందునా చట్టపరంగా పని చేయాలి. పోలీసు సేవలు అవసరమైన వారి పట్ల మరింత సానుభూతితో ఉండాలి. మారుతున్న నేరాలకు అనుగుణంగా మనము అప్ డేట్ అయ్యి వాటిని ఛేదించాలి. ప్రస్తుతం సైబర్ నేరాలు విస్తృతమయ్యాయి. ఈ నేరాలకు కారణాలేవైనా కట్టడి కోసం ప్రతీ జిల్లాలోను సైబర్ స్టేషన్ ఏర్పాటు చేసేలా సీఎం గారు సూత్రప్రాయంగా అంగీకరించారు. రాబోవు రోజుల్లో అవి రానున్నాయి. సైబర్ ఫోరెన్సిక్ విషయంలో కొత్త టూల్స్ కొనుగోలు చేసే ప్లానింగ్ లో ఉన్నాము. పెరుగుతున్న వైట్ కాలర్ క్రైం, ఇన్వెస్ట్మెంట్



ఫ్రాడ్స్, నార్కోటిక్స్ ల కట్టడి కోసం మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేయబోతున్నాము. మానసికంగా వేదనకు గురిచేసే సోషల్ మీడియా క్రైం నియంత్రణకు తగు చర్యలు చేపట్టబోతున్నాం. మహిళలు, చిన్నారులు, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకుంటున్నాము. సైంటిఫిక్ ఎయిడ్స్ లను వినియోగించి కేసుల దర్యాప్తుల్లో నాణ్యతను పెంచి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేస్తున్నాము. ముఖ్యంగా ప్రజలకు జవాబుదారీతనంగా ఉండటం, చివరి వరకు నిజాయితీగా, అంకితభావంతో పారదర్శకంగా విధులు నిర్వర్తించడం ప్రతీ పోలీసుకు ముఖ్యమని డిజిపీ గారు పేర్కొన్నారు.అనంతరం ...శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాలలో రాణించిన, ప్రతిభ కనపరిచిన, ప్రొబేషనరీ డీఎస్పీలకు రాష్ట్ర హోంశాఖామాత్యుల చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అనంతపురం పిటిసి ప్రిన్సిపాల్ ఐజీపి వెంకట్రామిరెడ్డి , రాష్ట్ర పోలీసు శాంతిభద్రతల విభాగం ఐజిపి సి.హెచ్ శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డి.ఐ.జి డాక్టర్ షిమోషి , అనంతపురం ఉమ్మడి జిల్లాల ఎస్పీలు

పి.జగదీష్ , వి.రత్న , అనంతపురం ఎం.పి అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునిత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కాలువ శ్రీనివాస్, జె.సి.అస్మిత్ రెడ్డి, బండారు శ్రావణి, ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథ్ రెడ్డి, జడ్పీ ఛేర్మన్ గిరిజమ్మ, అనంతపురం నగర మేయర్ వసీం, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, పలువురు సి.ఐ లు, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, ప్రొబేషనరీ డీఎస్పీల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# పోలీసులు మెత్తబడ్డారు.. ఇది జగన్ సర్కార్ కాదు..

రైతులకు అండగా ఉండటానికి తాను ఇక్కడికి వచ్చానన్నారు. ఇక్కడికి ఫ్యాక్టరీ రాలేదు కానీ.. అన్నాచెల్లెళ్లు కొట్టుకున్నారన్నారు.

అటవీ భూములను రెవెన్యూ భూములుగా మార్చి తీసేసుకున్నారన్నారు. మరి ఫ్యాక్టరీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

**యాభై ఏళ్లకు ఒకేసారి లీజు..**

జగన్ సీఎంగా ఉన్నప్పుడు యాభై ఏళ్ళకు లీజు తీసుకున్నారన్నారు. ఉపాధి అవకాశాలు ఇస్తే సంతోషమన్నారు. సహజ వనరులు ఒకరి సొంతం కాదన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతిలివ్వరని క్యాప్టివ్ పవర్ గా అనుమతి తీసుకున్నారన్నారు. పొల్యూషన్ బోర్డు అనుమతి తీసుకోలేదన్నారు. 700 ఎకరాల భూమి మాచవరం, దాచేపల్లి మండలాల్లో స్వంత ఫ్యాక్టరీ కోసం తీసుకున్నారన్నారు. రైతులకు, వారి పిల్లలకు ఉద్యోలిస్తామని భూములు తీసుకున్నారన్నారు. ఇది రాష్ట్ర సమస్య అని అన్నారు. గతంలో పెట్రోల్ బాంబులు, నాటు బాంబులు వేసి భయపెట్టారని ఆరోపించారు.

సరస్వతి కంపెనీకి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరగలేదన్నారు. గత ప్రభుత్వం ఇప్పుడున్న యువతను భయపెట్టిందన్నారు. పోలీసులు భయపడ్డారు.. లేదంటే మెత్తబడ్డారన్నారు. రౌడీయిజాన్ని అరికట్టాలన్నారు. కొందరు ఇంకా వైసీపీ ప్రభుత్వం ఉన్నట్లు భావిస్తున్నారన్నారు. లా అండ్ ఆర్డర్ ఎంత బలంగా ఉందో చేసి చూపిస్తామన్నారు. 700 ఎకరాలకు సరిపోయేంత నీళ్ళు తీసేసుకున్నారన్నారు. ఈ విషయంపై తాను కేబినెట్లో కూడా చర్చిస్తానన్నారు. ప్రజలపై బాంబుల దాడి చేస్తే చూస్తూ ఊరుకోవద్దని ఎస్పీకి చెబుతున్నానన్నారు.

# చంద్రబాబు ప్లాన్ అదుర్స్..ఏపీకి నెదర్లాండ్స్ సిస్టమ్

రాష్ట్రంలో ఇటీవల వారానికి పైగా కురిసిన భారీ వర్షానికి రాజధాని అమరావతి అతలాకుతలం అయింది. దీని కారణంగా బుడమేరు వాగు కట్ట తెగి పొంగిపొర్లింది. దీంతో విజయవాడలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమైయ్యాయి. ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. మరెన్నో జీవులు నీటిలో కొట్టుకుపోయాయి. తిండి తిప్పలు లేక ఎందరో విలవిలలాడారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరదల సమయంలో లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా సీఎం చంద్రబాబు నాయుడు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే సరికొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టబోతున్నారు.

ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సిఆర్‌డిఎ) రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి సోమవారం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో వరద సమస్యను ఎదుర్కోవడానికి నెదర్లాండ్స్ గ్రావిటీ కెనాల్ సిస్టమ్ ను ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమావేశంలో రింగురోడ్డు నిర్మాణం, రిజర్వాయర్ వ్యవస్థ వినియోగం వంటి ప్రాజెక్టుల కోసం సీఎం చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అందరి దృష్టిని ఆకర్షించింది.

ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ.. అమరావతికి రూ.15,000 కోట్లు విడుదల చేసేందుకు ప్రపంచబ్యాంకు అంగీకరించిందని.. కావున వరద నివారణ ప్రణాళికలను వీలైనంత త్వరగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా సెప్టెంబరులో విజయవాడకు వరదలు రావడంతో రాజధాని ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితి ఏర్పడిందని.. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతపై సమస్యను పరిష్కరించాలన్నారు.

**పలు ప్రాంతాల్లో రిజర్వాయర్లు**

ఇందులో భాగంగానే అమరావతిలోని పలు ప్రాంతాల్లో 217 కి.మీ మేర రిజర్వాయర్లు నిర్మిస్తున్నామన్నారు. అందులో రాజధాని ప్రాంతంలోని కొండవీటి, పాలవాగు వద్ద గ్రావిటీ కెనాల్ రిజర్వాయర్లు, నీరుకొండ, కృష్ణాయపాలెం, శాఖమూరు, వుండవల్లిలో స్టోరేజీ రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కాగా ఈ గ్రావిటీ కెనాల్ సిస్టమ్ అనేది నెదర్లాండ్ లో ఉపయోగించబడుతుంది. ఈ సిస్టమ్ ద్వారా నదులు లేదా కాలువల నుండి నీటిని పొలాలు, జలాశయాలకు మళ్లించడానికి గ్రావిటీ ఉపయోగించబడుతుంది.

**గ్రావిటీ కెనాల్ సిస్టమ్?**

గ్రావిటీ కెనాల్ సిస్టమ్ అనేది ప్రాథమికంగా గురుత్వాకర్షణ సూత్రంపై ఆధారపడిన డ్రైనేజీ, నీటిపారుదల వ్యవస్థ. ఈ విధానంలో కాలువల ద్వారా గురుత్వాకర్షణ శక్తితో నీటిని ఒక చోట నుండి మరొక చోటకి రవాణా చేస్తారు. ఇది ప్రధానంగా నీటిపారుదల కోసం ఉపయోగించబడుతుంది. ఈ వ్యవస్థలో నీరును ఎత్తైన ప్రదేశం నుండి దిగువ ప్రదేశానికి మళ్లిస్తారు. వీటిలో కాలువలు, చానెల్స్ ఉపయోగిస్తారు. అయితే ఇందులో చానెళ్లు పొలాలకు మాత్రమే నీటిని అందించడానికి ఉపయోగపడతాయి.

ఇక గ్రావిటీ కెనాల్ సిస్టమ్ ను గంగా కెనాల్, ఇంద్రప్రస్థ కెనాల్ మొదలైన భారతదేశంలోని అనేక నీటిపారుదల ప్రాజెక్టులలో ఉపయోగించబడుతుంది. ముఖ్యంగా ఈ కాల్వలు రైతులకు సాగునీరు అందించేందుకు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి.

**వరదలను ఎలా నివారిస్తాయి?**

అయితే గ్రావిటీ కెనాల్ సిస్టమ్ అనేది కొంత వరకు సహాయపడుతుంది. ప్రధానంగా ఈ గ్రావిటీ కెనాల్ సిస్టమ్ అనేది నీటిపారుదల కోసం రూపొందించబడింది. దీని ద్వారా నదులు లేదా జలాశయాల నుండి నీటిని నియంత్రిత ప్రదేశాలకు మళ్లిస్తారు. ముఖ్యంగా వరదల సమయంలో నీటి స్థాయిలు పెరిగినపుడు ఆ వరద నీటిని లోతట్టు ప్రాంతాల నుండి బయటకు పంపడానికి వీలు కల్పిస్తుంది. దీని వల్ల లోతట్టు ప్రాంతాలు సేఫ్ గా ఉంటాయి. దీని ద్వారా వరద ప్రభావాన్ని నివారించవచ్చు.

# రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడమే మా కర్తవ్యం: రేవంత్ రెడ్డి

మనది రైజింగ్ తెలంగాణ... కాబట్టి దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడం మన కర్తవ్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బోయినపల్లి గాంధీ తత్వ చింతన కేంద్రంలో కులగణనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కులగణన సర్వేను ప్రభుత్వం బాధ్యతగా భావించిందన్నారు.


కులగణనపై తమ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నెరవేర్చడమే ప్రథమ కర్తవ్యమన్నారు. కులగణనను మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలనేది రాహుల్ గాంధీ ఆలోచన అన్నారు. కులగణనను త్వరితగతిన పూర్తి చేసి బీసీలకు అందాల్సిన రిజర్వేషన్లను అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కులగణనను 2025 జనగణనలో పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఈ వేదిక పైనే తీర్మానం చేస్తున్నామన్నారు.



కులగణనపై పౌర సమాజం నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్ గాంధీ హైదరాబాద్ రావడం గొప్ప విషయమన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు కులగణన సర్వే కీలకమన్నారు. సామాజిక బాధ్యత, సమాన అవకాశాలు కల్పించాలన్నదే రాహుల్ గాంధీ ఆలోచన అన్నారు.

# జాతీయ విద్యా దినోత్సవ వ్యాసరచన పోటీలు

**భారతరత్న అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగాలి నిర్వహణ నందాల ఐఎంఏ, లయన్స్ క్లబ్ 9వ తేదీ, పాఠశాల విద్యార్థులకులి**



**నంద్యాల నవంబర్ 6(రిపబ్లిక్ న్యూస్):** స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి,భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగా నవంబర్ 11 జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకుని, ఐఎంఏ నంద్యాల,లయన్స్ క్లబ్ నంద్యాల సంయుక్త నిర్వహణలో ఈనెల తొమ్మిదవ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల భాషలలో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుంది. "మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం- సందేశం" అన్న అంశంపై 90 నిమిషాలు కేటాయించి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. వ్యాసరచన రాయడానికి అవసరమైన కాగితాలు నిర్వాహకులు అందజేస్తారు.

పాల్గొనదలచిన వారు ఏడవ తేదీ సాయంత్రం 6 గంటలలోపు లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ 9866367560 నెంబర్ కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలి.

పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రం అందజేయబడుతుంది. తెలుగు, ఆంగ్ల భాషలలో వేరువేరుగా ప్రధమ, ద్వితీయ,తృతీయ మరియు రెండు స్పెషల్ జ్యూరీ విజేతలకు 11వ తేదీ రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించే కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ సహకారంతో బహుమతులుగా దేశ నాయకుల పుస్తకాలు, జ్ఞాపికలు,బహుమతి ప్రశంసా పత్రాలు అందజేయబడతాయి.

ఈ వ్యాసరచన పోటీలలో పాల్గొనవలసిందిగా కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ రవికృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, కోశాధికారి సురేంద్ర నాథ్ రెడ్డి,లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిజాముద్దీన్, శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ళ నాగరాజు పాఠశాల విద్యార్థులను ఆహ్వానిస్తున్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతర పోరాటం



**పాణ్యం (రిపబ్లిక్ న్యూస్)** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ తమ యొక్క విలువైన జీవితాలను ప్రజా సమస్యలపై పోరాడేందుకు నిత్యము అక్షరాలతో పోరాటం చేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ సభ్యులు ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నియోజకవర్గ , మండల కమిటీ సభ్యులు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కేక్ కట్ చేసి పరస్పరం ఒకరికొకరు కేకులు తినిపించుకొని ఈ సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గ, మండల స్థాయి కమిటీ సభ్యులు మాట్లాడుతూ విలేకరుల సమస్యలపై నిత్యము పోరాటాలు కొనసాగిస్తూ అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు వచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూ అధికారులను సమన్వయం చేస్తూ యూనియన్ ముందుకు సాగుతుందన్నారు. ఇప్పటికే మండల, నియోజకవర్గ జిల్లా రాష్ట్రస్థాయి లలో యూనియన్ తరచూ సమావేశంలు నిర్వహిస్తూ జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తూ సంబంధిత అధికారులను వారి దృష్టికి జర్నలిస్టుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం చేసే దిశగా యూనియన్ సభ్యులు కృషి చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇల్లు నిర్మాణము, కుటుంబ సభ్యులలో పిల్లలకు 50% ఫీజు రాయితీ, ప్రభుత్వ పథకాలలో అర్హత లాంటి విషయాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్ళేందుకు యూనియన్ తరపున ఎంతో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ స్థాయి కమిటీ గౌరవ అధ్యక్షులు రంగస్వామి, అధ్యక్షులు రమేష్, మండల కమిటీ అధ్యక్షులు ఏకే శ్రీనివాసులు, ఇప్ప సుధాకర్, బాల కంబయ్య, శ్రీనివాసులు, అప్సర్ భాష, జావేద్, చిన్నన్న, సుబ్బయ్య, సుబ్బరాయుడు, నబీ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# మిట్టపల్లి లో పేరుకే గ్రామీణ ఆరోగ్య కేంద్రం

**విధులకు డుమ్మా ..బయట షికారులు**
**వైద్య సేవలు అస్తవ్యస్తం**
**ఎప్పుడు తెరుస్తారో.? ఎప్పుడు మూస్తారో.? తెలియదు**
**ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తున్న ఎంఎల్ హెచ్ పి**
**గ్రామస్తుల ఆరోపణలు..**






**ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్:** ఆళ్లగడ్డ మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో ఆయుష్మాన్ భారత్ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లో వైద్య సేవలు ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. ఎప్పుడు చూసినా విలేజ్ హెల్త్ క్లినిక్ డోర్ లాక్ ఉండడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు అవాక్క లిసిన పరిస్థితి నెలకొంది. ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పేదలకు ప్రభుత్వ ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉన్నా కూడా ఇక్కడ పనిచేస్తున్న ఎం ఎల్ హెచ్ పి విలేజ్ క్లినిక్ సెంటర్లో ఎప్పుడు ఉంటారో తెలియదు ఎప్పుడు వెళ్తారో తెలియదు గత మూడు రోజులుగా వెల్నెస్ కేంద్రం తెరవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మీడియా ప్రతినిధులు మిట్టపల్లి లోని విలేజ్ఆరోగ్య వెల్నెస్ కేంద్రం మూసి ఉండడంతో జిల్లా నోడల్ వైద్యాధికారి జగదీష్ చంద్రారెడ్డి, అహోబిలం పీహెచ్సీ వైద్యులు శివ మోహన్, ని సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదు పూర్తి వివరాలు తెలియజేస్తామని మీడియా ప్రతినిధులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ లను నెలకొల్పితే ఇక్కడ పనిచేస్తున్న ఎమ్ ఎల్ హెచ్ పి. వైద్య సేవలు అందించకపోవడం పట్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా గ్రామాలలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లోనూ బాధితులు ఉంటున్నారు వీరిలో ఎక్కువ మంది వైరల్ ఫీవర్ తీవ్రమైన జ్వరం నాలుగైదు రోజుల కైనా తగ్గకపోవడంతో ఆందోళన చెందుతున్న వారంతా ఆసుపత్రుల్లో చేరుతున్నారు. గ్రామ పరిసరాల్లో అపరిశుభ్రత వ్యాధులు ప్రబలుతున్నాయి .గతం కంటే మలేరియా విజృంభిస్తుంది. పెద్ద సంఖ్యలో రోగులు ఆసుపత్రి పాలవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోగ్రామంలో ఉన్న విలేజ్ క్లినిక్ ఆసుపత్రి డోర్ లాక్ ఉండడంతో వైద్యం భారమై సామాన్యులు సతమతమవుతున్నారు. వాతావరణంలో మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. వైద్య అధికారులు వెంటనే స్పందించి మిట్టపల్లి గ్రామంలోని వెల్నెస్ కేంద్రాన్ని సకాలంలో ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా, అలాగే ఇక్కడ పనిచేస్తున్న ఎం ఎల్ హెచ్ పి వైద్య అధికారి విధులకు సకాలంలో వచ్చేలాగున చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# పశు వైద్యశాలల్లో మందుల కొరత







**సకాలంలో వైద్యం అందక**
**మూగజీవాల రోదన..**
**..సబ్ సెంటర్ లను వేధిస్తున్న**
**మందుల కొరత..**
**పశు పోషకుల ఆందోళన**

**ఆళ్లగడ్డ రిపబ్లిక్ న్యూస్:** ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందుల కొరత వేధిస్తున్నది. దీనితో పాడి పశువులకు సకాలంలో వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతుండడంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 70 వేలకు పైగా పశుసంపద ఉంది. 80% మంది రైతులు పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. నిత్యం

వేలాది లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతున్నది. కాగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వెటర్నరీ ఆసుపత్రులలో పశువులకు ఏవైనా వ్యాధులు సంక్రమించినప్పుడు మందులు అందుబాటులో లేకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని ఆళ్లగడ్డ చాగలమరి రుద్రవరం సిరివెళ్ల దొర్నిపాడు ఉయ్యాలవాడ మండలాలలో ఉన్న పశుసంవర్ధక శాఖ సబ్ సెంటర్లలో మందులు పూర్తిగా లేవు.

గాలికుంటు వ్యాధికి వ్యాక్సిన్ కూడా అందుబాటులో లేదు.

రుద్రవరం మండలంలోని ముత్తలూరు గ్రామంలో ఉన్న వెటర్నరీ సబ్ సెంటర్లో గత రెండు సంవత్సరాలుగా మందులు లేక పాడి పశువులకు సకాలంలో వైద్యం అందడం లేదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన సన్నకారు రైతు లింగారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ముత్తలూరు గ్రామంలో పేరుకు మాత్రమే వెటర్నరీ ఆసుపత్రి ఉందని ప్రభుత్వం ఇక్కడికి సకాలంలో మందులను సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పశువులకు సీజనల్ వారీగా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పశు పోషకులకు టీకాలు మందులు సరఫరా ఉద్యమంలా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతుంది. కానీ నియోజకవర్గంలోని రుద్రవరం, సిరివెళ్ల మండల పశు వైద్యాధికారుల నిర్లక్ష్య ధోరణి వల్ల బస్సు పోషకులకు దరిచేయడం లేదు అని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇక్కడ పనిచేస్తున్న అధికారి తమకు అందుబాటులో ఉన్నప్పటికీ సబ్ సెంటర్లో మందులు, మాత్రలు మాత్రం అందుబాటులో లేవని తెలిపారు. దీనితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల తమ గోవు డెలివరీ అయితే దూడకు అనారోగ్యం కలిగినప్పుడు రాము ఎన్నవే ప్రయాసలకు ఓర్చి ఎర్రగుడిదిన్నె గ్రామానికి వెళ్లి ఆపరేషన్ చేయించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఉన్నతాధికారులు ఎప్పటికైనా తమ సబ్ సెంటర్కు మందులను పంపి సమస్యను తీర్చాలని మీడియా ముఖంగా విజ్ఞప్తి చేశారు.

సబ్ సెంటర్ జూనియర్ వెటర్నరీ అధికారి లక్ష్మణచంద్ర యాదవ్ మాట్లాడుతూ ముత్తలూరు గ్రామ జూనియర్ వెటర్నరీ అధికారిగా తాను పనిచేస్తున్నానని ఈ కేంద్రంలో మందుల కోసం తాము గత ఐదు నెలల కిందట ఇండెంట్ పెట్టినా ఇప్పటికీ మందుల సరఫరాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు రైతుల నుండి ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ అలాగే వారికి నచ్చదు వైద్యం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి నెలకొందని ఆయన తెలిపారు. ప్రభుత్వం మందులను వెంటనే సరఫరా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పెంచికలపల్లిలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు.

**డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే**




**పాములపాడు, నవంబర్ 5, రిపబ్లిక్ న్యూస్ ::** భారతీయ కాలమానం ప్రకారం ప్రతి మాసానికి ఒక విశిష్టమైన స్థానం ఉన్నది. భారతీయ కాలమానం ప్రకారం ప్రతి మాసానికి ఒక విశిష్టమైన స్థానం ఉన్నదని, అందుకే ఆయా మాసాలలో ఆయా నియమాలు, వ్రతాలు, వివిధ రకాల ఆచారాలు ఉన్నాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, పాములపాడు మండలం, పెంచికలపల్లి గ్రామంలో వెలసిన శివాలయం నందు నాలుగు రోజుల ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభోత్సవ సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. వనభోజనాలు సామాజిక అస్పృశ్యతను తొలగించి సామాజిక సమరసతను కలిగిస్తాయని అన్నారు. మన భారతీయ ఆచారవ్యవహారాలలో ప్రతి ఆచారం వెనుక శాస్త్రీయ విజ్ఞానం ఉన్నదని అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు ధార్మిక ప్రవచకులు ఆమంచి వేంకటేశ్వర శర్మ మాట్లాడుతూ సమాజంలో ధార్మిక నిష్ఠ ఏర్పడినప్పుడే ఆత్మశక్తి పెరుగుతుందని అన్నారు. అందుకు శ్రీమద్రామాయణం లోని వివిధ సంఘటనలను సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు బి. నాగలింగమయ్య, అర్చకులు ఎస్. మౌళాలి గౌడ్, కె.నారాయణ గౌడ్, యం నారాయణ, జి. నాగలింగమయ్య గౌడ్, యం. రాజేశ్వరరావు, యం. నాగరాజుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బుజ్జి బుజ్జి మరదలా.. టైటిల్ రిలీజ్ ఈవెంట్...




**ఆళ్లగడ్డ నవంబర్ 5 రిపబ్లిక్ న్యూస్** పట్టణంలోని స్థానిక ప్రజ్ఞా కాలేజ్ నందు మంగళవారం ఆళ్లగడ్డ కుర్రాళ్ళు యూట్యూబ్ ఛానల్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న మాభాష హీరోగా బుజ్జి బుజ్జి మరదలా సాంగ్ టైటిల్ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజ్ఞా కాలేజీ సిబ్బంది సెల్ పాయింట్ సురేంద్ర బరగొడ్ల హుస్సేన్ భాష సమక్షంలో భారీ ఎత్తున పోస్టర్ రిలీజ్ చేయడం జరిగింది ఈ సందర్భంగా హీరో మా భాష మాట్లాడుతూ త్వరలో అన్ని హంగులతో సరికొత్త నూతన సాంగ్ మీ ముందుకు రాబోతుందని ప్రజలందరూ తప్పక ఆదరించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ చరణ్ మాస్టర్, కెమెరామెన్ గఫూర్ బాబా, మ్యూజిక్ డైరెక్టర్ అంజి తదితరులు పాల్గొన్నారు

# ప్రజల భద్రత, రక్షణ, ధ్యేయముగా, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాలపై అవగాహన



**నంద్యాల క్రైం, నవంబర్ 5, (రిపబ్లిక్ న్యూస్):**

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్ మరింత కట్టుదిట్టం చేసి జిల్లాలో పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో ముఖ్యమైన కూడళ్ళ నందు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు చేస్తూ, మోటార్ వాహనాలు చట్టం ప్రకారం నియమ నిబంధనలను పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్నారు.ప్రతి రోజు జిల్లా అంతట విజిబుల్ పోలీసింగ్ నిర్వహణ జరుగుతుంది. ఈ విజిబుల్ పోలీసింగ్ లో ట్రిపుల్ రైడింగ్, వాహనానికి సరైన నెంబర్ ప్లేట్లు లేనివారిని, వాహన సంబంధిత రికార్డులు లేనివారిని, హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్ నడిపే వ్యక్తులను, సెల్ ఫోన్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ చేసే వారిని గుర్తించి జరిమానా విదించడంతో పాటు, వారికి జిల్లా పోలీస్ అధికారులచే రోడ్డు భద్రతా, మోటార్ వాహనాల చట్టం నియమ నిబంధనలు గురించి,యువత చెడుమార్గం వైపు మల్లకుండా అవగాహన చేస్తున్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ల వద్ద

స్పీడ్ బ్రేకర్లు సూచించేలా హెచ్చరికల బోర్డులు గమనించాలని ,జాతీయ రహదారులపై స్పీడ్ గన్స్ తో వేగ నియంత్రణకు కృషి చేస్తున్నారు. డ్రంకన్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ లపై ప్రధానంగా దృష్టి ఉంచి నివారణకు కృషి చేస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండేలా, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయకుండా, పరిమితికి మించి ప్రయాణీకులు వాహనాల్లో వెళ్ళకుండా పలు జాగ్రత్తలు పాటిస్తే దాదాపు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వాహనదారులకు పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పోలీసులు సూచించే నిబంధనలు పాటిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా సురక్షితంగా గమ్యం చేరాలని, ప్రాణనష్టం జరగకుండా తమ ప్రాణాలను రక్షించుకోవాలని ఈ సందర్భంగా పోలీసు అదికారులు తెలియజేశారు. కావున వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా, మోటార్ వాహనాల చట్టం నియమ నిబంధనలు ప్రకారం నడుచుకోవాలని పోలీసు అదికారులు తెలియజేశారు.

## ఓర్వకల్లు పారిశ్రామిక వాడ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.



**కర్నూలు, నవంబర్ 05, రిపబ్లిక్ న్యూస్ ::** ఓర్వకల్లు పారిశ్రామిక వాడ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు..

మంగళవారం ఓర్వకల్లు తహసిల్దార్ కార్యాలయంలో ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధిపై ఏపీఐఐసీ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు..అనంతరం మెగా ఇండస్ట్రియల్ హబ్ కు సంబంధించి ఏపీఐఐసీ భూముల్లో జరుగుతున్న మౌలిక వసతుల పనులను కలెక్టర్ పరిశీలించారు..

ఈ సందర్భంగా కలెక్టర్ ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేస్తున్న పైప్ లైన్ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.. పనులు 50 శాతం పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు.. పారిశ్రామిక వాడ భూముల్లో జరుగుతున్న ఇంటర్నల్ రోడ్ల పనులను పరిశీలించి, వచ్చే మూడు నెలల లోపు పనులు పూర్తి కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..జిల్లా అభివృద్ధికి ఓర్వకల్లు పారిశ్రామిక వాడ గ్రోత్ ఇంజన్ గా ఉపకరిస్తుందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్.**

ఓర్వకల్లు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు..కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు... ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన అర్జీలను గడువు లోపు నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.. కొత్తగా ఓటరు నమోదు కొరకు ఇప్పటివరకు ఏమైనా దరఖాస్తులు వచ్చాయా? అని కలెక్టర్ ఆరా తీశారు..వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..

కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పరిశ్రమల శాఖ ఇన్చార్జ్ జిఎం అరుణ, ఓర్వకల్లు తహసీల్దార్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.




## ఆళ్లగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డి.టి.ఓ...



**ఆళ్లగడ్డ నవంబర్ 5 రిపబ్లిక్ న్యూస్** ఆళ్లగడ్డ పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయాన్ని మంగళవారం జిల్లా ఖజానా శాఖ అధికారి మరియు గణాంక అధికారి ఏం. లక్ష్మీదేవి తనిఖీ నిర్వహించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆమె ఆళ్లగడ్డ ఖజానా కార్యాలయానికి చేరుకొని పలు రికార్డులను పరిశీలించారు. ఖజానా ఉద్యోగుల అటెండెన్స్ రిజిస్టర్లు, గణాంక విభాగంకు సంబంధించిన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ శాఖల దస్త్రాలను ఉంచే ఖజానాను కూడా పరిశీలించారు.

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ పెన్షన్ దారులకు పలు కీలక సూచనలు చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని విశ్రాంత ఉద్యోగులు నామినేషన్ సౌకర్యాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని పెన్షన్ దారుడు జీవించి ఉన్నప్పుడే తమ ఫైల్స్ లో నామినేషన్ సౌకర్యం ఏర్పాటు చేసుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని జిల్లా ట్రెజరీ అధికారి లక్ష్మీదేవి సూచించారు. నామినేషన్ ఉంటే ఎలాంటి సమస్యలు రావని కోర్టుకు కూడా వెళ్లే పరిస్థితి ఉండదని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి సుశీల, అకౌంట్ అధికారి, సిబ్బంది ప్రవీణ్ కుమార్, రాముడు తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ నేతలకు తొత్తులుగా నాడు అధికారులు

**బుగ్గన బంధువుకు భూమిని కట్టబెట్టిన వైనం**

**అప్పు ఇచ్చిన డబ్బులు అడుగుతుంటే ప్రాణాలు తీస్తామని బెదిరింపులు**

**పని కల్పిస్తామని విదేశాలకు తిసుకెళ్లి చిత్రహింసలు**

**నేతలకు మొరపెట్టుకున్న బాధితులు**

**మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట... మంత్రి ఫరూక్**

**టిడిపి కేంద్ర కార్యాలయానికి వచ్చి వినతులు సమర్పించిన బాధితులు**

**అమరావతి నవంబర్ 5(రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లాలో వైసీపీ నేతలకు సహకరిస్తూ.. తమ భూమిని అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బంధువు బీఆర్సీ బుగ్గారెడ్డికి అక్రమంగా రెవెన్యూ అధికారులు ఆన్ లైన్ చేశారని పాణ్యం మండలం గోరుకల్లు గ్రామానికి చెందిన సురేష్ బాబు తనకు జరిగిన అన్యాయాన్ని ఏకరువు పెట్టారు .

మంగళవారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో సురేష్ బాబు టిడిపి నాయకులకు తనకు జరిగిన అన్యాయంపై వివరించారు. దీనిపై నాడు ప్రశ్నిస్తే పోలీసులతో బెదిరించారని.. వారికి అక్రమంగా ఆన్ లైన్ చేసిన 14 సెంట్లను రద్దు చేసి ఈ అక్రమాలకు సహకరించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్ లో నేతలకు ఫిర్యాదు చేశాడు.

అర్జీని స్వీకరించిన రాష్ట్ర మైనారిటీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్లరామయ్య, మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎంఏ షరీఫ్, బుచ్చిరాంప్రసాద్ లు అర్జీని స్వీకరించి న్యాయం చేస్తామని బాధితుడికి హామి ఇచ్చారు.

అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగుతుంటే.. తనను, తన కుటుంబ సభ్యులను చంపేస్తామని చింతల చెరువు వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి బెదిరిస్తున్నాడని.. అవసరం అంటే ఇంటి కాగితాలు తాకట్టు పెట్టి రూ.32 లక్షలు అప్పుగా ఇచ్చానని. ఇప్పుడు డబ్బులు ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకోమంటున్నాడని తనకు వెంకటేశ్వరరెడ్డి నుండి రావాల్సిన డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని విజయవాడకు చెందిన యక్కంటి కృష్ణారెడ్డి నేతల ముందు వాపోయాడు.

పనిచూపిస్తానని తన భార్యను మస్కట్ తీసుకెళ్లి అక్కడ పనికల్పించకుండా తనకు తిండి పెట్టకుండా ఏజెంట్ ఇబ్బంది పెడుతున్నాడని,తన భార్యను ఇండియాకు తిరిగి పంపించమని అడిగితే డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని,ఏజెంట్ మల్లీడి సుబ్రహ్మణ్యంపై పాలకొల్లు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తల్లికోసం పిల్లలు బెంగ పెట్టుకున్నారని అంతేకాకుండా మస్కట్ లో ఉన్న తన భార్య ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని,తనను ఎలాగైనా ఇండియాకు రప్పించాలని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన టి. రాజశేఖర్ నేతలకు విన్నవించుకొన్నాడు.

తన పొలాన్ని వైసీపీ నేతల కబ్జా చేస్తే.. న్యాయం కోసం పోలీసులు, అధికారులు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడంలేదని.. తిరిగి తనపైనే దాడులకు దిగుతున్నారని కృష్ణా జిల్లా జి. కొండూరుకు చెందిన మేరెడ్డి సామ్రాజ్యం అనే మహిళ నేతలకు ఫిర్యాదు చేశారు. విచారించి తనకు న్యాయం చేసేలా చూడాలని కోరారు.

కేంద్రం నుండి రిటైర్డ్ అయిన మాజీ ఉద్యోగులు తమ ఆరోగ్య సమస్యలపై ఆసుపత్రులకు వెళ్లాలంటే నెల్లూరులో ఉండే సిజిహెచ్ఎస్ కు వెళ్లవలసి వస్తోందని.. దూరాభారంతో వృద్ధాప్యంలో ఇబ్బందులు పడాల్సి వస్తోందని.. కావున కర్నూలులో మరో ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఏవైన్ బాబు రాజ్ నేతలను కోరారు.

ప్రకాశం జిల్లా చిన్నగుడిపాడుకు చెందిన రమణబాబు అనే వ్యక్తి నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. దాదాపు నాలుగు తరాలుగా తమ పూర్వికుల పండిచుకుని అనుభవంలో ఉన్న భూమిని... కరువు రిత్యా ఉపాధి కోసం మరో ఊరికి వెళ్లగా.. అప్పటి నేతల చర్యలతో ప్రభుత్వం ఆ భూమిని వేరొకరికి కేటాయించిందని.. వారికి కేటాయించిన భూమిని రద్దు చేసి తమకు భూమిపై హక్కులు కల్పించాలని.. అలాగే ప్రభుత్వం ఎవరికైతే భూమి కేటాయించిందో వారికి న్యాయం జరిగేలా



మరొక చోట భూమి కేటాయించాలని అలా కుదరని పక్షంలో తమకు మరొక చోట అంతే భూమిని కేటాయించాలని విన్నవించుకున్నాడు.

**మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది... మంత్రి ఫరూక్**

గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో కొత్త మసీదుల నిర్మాణం, మరమ్మతులకు నిధులు, షాదిఖానాల నిర్మాణం, చర్చిల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేసినప్పటికీ, వైసిపి ప్రభుత్వం నిధులను నిలిపివేసిందని వెంటనే మైనార్టీల సంక్షేమం కోసం నిలిచిపోయిన మైనారిటీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని పలువురు ప్రతినిధులు మైనార్టీల తరఫున మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ కు విన్నవించారు. ఈ విషయంపై మంత్రి ఫరూక్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఇప్పటికే మైనార్టీల సంక్షేమం కోసం సీఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కార్యాచరణ బద్ధంగా చర్యలు చేపట్టడం జరిగిందని, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఉపాధి కోసం కువైట్ దుబాయ్ గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు ఏజెంట్ల చేతిలో మోసపోయి ఆయా దేశాల్లో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఏజెంట్ల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని మంత్రి ఫరూక్ బాధితులకు హామీ ఇచ్చారు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు సీఎం ఆర్ఎఫ్ సాయం కోసం అర్జీలు తీసుకురాగా.. మరికొందరు నామినేటెడ్ పదవులు ఆశిస్తూ.. నేతలు అర్జీలు ఇచ్చారు. వివిధ సమస్యలపై తమకు న్యాయం చేయాలంటూ పలువురు నేతలను వేడుకున్నారు.

# విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్న మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు




### ఎం.రామకృష్ణ, పి.డి.ఎస్.యు జాతీయ కన్వీనర్

**నంద్యాల నవంబర్ 5 ( రిపబ్లిక్ న్యూస్)** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నాయని పి.డి.ఎస్.యు జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ విమర్శించారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు ) 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పిడిఎస్ యు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పద్మావతి సర్కిల్ నుండి 1500 మంది విద్యార్థులతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటినరీ టౌన్ హాల్లో "వసంత మేఘ గర్జన సభ" జరిగింది. ఈ సభకు పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ.రఫీ అధ్యక్షత వహించారు.

ఈ సభకు ముఖ్య వక్తగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ 1960 దశకం చివర్లో నక్సల్బరీ వసంత మేఘ గర్జన ప్రేరణతో ఆవిర్భవించిందే పిడిఎస్.యు అని అన్నారు. పిడిఎస్యు విప్లవ విద్యార్థి ఉద్యమంలో కామ్రేడ్స్ జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్ , చేరాలు , సాంబయ్య, వరహాలు, నారాయణ, రంగవల్లి వంటి వారెందరో అమరులయ్యారని అన్నారు. సరిగ్గా ఇదేరోజు 1975 నవంబర్ 5న విప్లవ మేధావి, ఎమ్మెల్సీ నీలం రామచంద్రయ్య, పిడిఎస్యు నిర్మాత కామ్రేడ్ జేసిఎస్ ప్రసాద్ లను పోలీసులు విజయవాడలో అరెస్టు చేసి, చిత్రహింసలకు గురిచేసి, కాల్చి చంపారని అన్నారు. విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా సాధన కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 52 సంవత్సరాల క్రితం కామ్రేడ్ జార్జిరెడ్డిని హత్య చేసిన మతోన్మాద శక్తులు నేడు దేశాన్ని పరిపాలిస్తున్నాయని అన్నారు. మోడీ పాలనలో యూనివర్సిటీలు అగ్రకుల అగ్రహారాలుగా మారాయని విమర్శించారు. వేలాది ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచింగ్- నాన్ టీచింగ్ పోస్టుల ఖాళీలతో యూనివర్సిటీ విద్య సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. విద్యా రంగాన్ని కార్పొరేటీకరణ, కాషాయికరణ, కేంద్రీకరణ చేయడం కోసమే నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చిందని మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. లౌకిక, ప్రజాస్వామిక హక్కులను హరించి వేస్తుందని దుయ్యబట్టారు.

ఈ సభలో ఏపీటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పాఠశాల విద్యను ధ్వంసం చేసే 117 జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పిడిఎస్ యు జాతీయ నాయకులు యు.గనిరాజు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం హిందూ ఫాసిస్ట్ విధానాలను అవలంబిస్తుందని, దేశ సంపదను అదాని, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబడుతుందని విమర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంలో ఆంధ్ర రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలైన ప్రత్యేక హెూదా, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రత్యేక ప్యాకేజీ , కడప ఉక్కు పరిశ్రమ, 11 కేంద్రీయ విద్యా సంస్థల స్థాపన వంటి విభజన హామీల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. పర్యావరణాన్ని, ప్రజా జీవితాన్ని ధ్వంసం చేసే కప్పట్రాళ్లలో యురేనియం తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సేవ్ కప్పట్రాళ్ల ఉద్యమానికి పిడిఎస్ యు పూర్తి సంఘీభావంగా ఉద్యమిస్తుందని తెలిపారు.

పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎండి. రఫీ, ఎస్. కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే 77 జీవోను తక్షణమే రద్దు చేయాలని, పెండింగ్లో ఉన్న 3,800 కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఈ సభలో సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి కే.నాగరాజు, పిడిఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి సిద్దు, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను ప్రసాద్, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. భీమశంకర్, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సత్యన్న, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు బాలరాజు, పిడిఎస్యు రాష్ట్ర నాయకులు షాహిద్ ,కిరణ్ నవీన్,నవీన్ తదితరులు ప్రసంగించారు. అరుణోదయ భీమశంకర్, జి.శ్రీనుల బృందం విద్యార్థి విప్లవగేయాలు ఆలపించి సభికులను ఉత్తేజపరిచారు. ఈ సభ ప్రారంభానికి ముందు పి.డి.ఎస్.యు బిగిపిడికిలి జెండాను రఫీ ఎగురవేశారు. అమరవీరులకు సంతాపాన్ని తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

విద్యార్థుల భారీ ప్రదర్శన

పి.డి.ఎస్.యు 50 వసంతాల మేఘ గర్జన సభ ప్రారంభానికి ముందు పద్మావతి సెంటర్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా మునిసిపల్ సెంటినరీ టౌన్ హాల్ వరకు విద్యార్థులు ఎర్ర జెండాలు చేతబట్టి భారీ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. "పిడిఎస్ యు జిందాబాద్", "శాస్త్రీయ విద్యాసాధనకై పోరాడుదాం", "హిందు పాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం", "నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి", "కప్పట్రాళ్లలో యురేనియం త్రవ్వకాలను నిలిపివేయాలి", "సేవ్ కప్పట్రాళ్ల" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రెండువేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# సీప్లేన్ విధాన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్.








**శ్రీశైలం, నవంబర్ 05, రిపబ్లిక్ న్యూస్. ::**

రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని... ఇందులో భాగంగానే సీప్లేన్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉందని అందుకు తగ్గ ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. మంగళవారం శ్రీశైలంలో స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో పాటు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ లతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పాతాళ గంగ వద్ద బోటింగ్ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మీడియా విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ కృష్ణా నది పున్నమి ఘాట్ నుంచి విజయవాడ - శ్రీశైలం మధ్య సీప్లేన్ ప్రారంభానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారన్నారు. విజయవాడలో ప్రారంభమైన సీప్లేన్ నల్గొండ టన్నెల్ వద్ద ల్యాండ్ అయి పాతాళ గంగ బోటింగ్ పాయింట్ వద్ద ప్లాస్టిక్ జెట్ కు చేరుకొని రోప్ వే ద్వారా శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సందర్శిస్తారన్నారు. ఇందుకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, గ్రీన్ రూమ్, విఐపి ల సీటింగ్ అరేంజ్మెంట్ తదితర ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు రోప్ వే ఎంట్రీ పాయింట్ వెలుపల ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసి ఎల్ 1, గ్రీన్ రూమ్ ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే త్రాగునీటి వసతి, పార్కింగ్, తాత్కాలిక టాయిలెట్ల ఏర్పాట్లకు కూడా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను సూచించారు. దేవస్థాన పరిధిలో ముఖ్యమంత్రి ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీలు దేవస్థాన ఈఓతో మాట్లాడి పలు ఆదేశాలు జారీ చేశారు. పాతాళ గంగ బోటింగ్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ జెట్ ను పరిశీలించారు. ల్యాడర్ కు డెకరేషన్ చేయాలన్నారు. రోప్ వే భవనం, క్యాబిన్, నడకదారుల్లో ముమ్మర పారిశుధ్య చర్యలు చేపట్టి పెయింటింగ్ వేసి ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దాలన్నారు. ఏర్పాట్లలో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రోప్ వే పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ, దేవస్థాన అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్లాస్టిక్ జెట్ ఏర్పాటుతో పాటు ల్యాడర్ కు డెకరేషన్, రోప్ వే భవనం, క్యాబిన్, నడకదారుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టి పెయింటింగ్ వేసి ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దాలన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com